క్లుప్తంగా

290 మందికి వైద్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

నరసన్నపేట: స్థానిక బండి వీధిలోని స్వర్ణకార భవనంలో బుధవారం నిర్వహించిన క్యాన్సర్ వైద్య శిబిరంలో 290 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి చెందిన వైద్యులతోపాటు విశాఖలోని ఓ ప్రైవేట్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలు సుభద్రాదేవి రోగులకు తనిఖీలు చేసి అవగాహన కల్పించారు. స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. దీంట్లో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు వచ్చి తనిఖీలు చేశారు. స్థానిక అరవింద్ మెడికల్ సెంటర్ సిబ్బంది సహకారం అందించారు. స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం



మాట్లాడుతున్న రుక్మాంగధరరావు

నరసన్నపేట: విద్యార్థి దశలో క్రమశిక్షణ ప్రధానమని విశ్రాంత ఆర్ఐఓ రుక్మాంగధరరావు అన్నారు. స్థానిక జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం బుధవారం సందడిగా నిర్వహించారు. క్రమశిక్షణతో ఉండి ఉన్నత లక్ష్యాలు కలిగిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. సినీ గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు రంగారావు, నిరంజనరావు, ప్రిన్సిపాల్ కృష్ణారావు తదితరులు పలు సూచనలు చేశారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత



నరసన్న చెరువు వద్ద నిర్మాణ పనులు పరిశీలిస్తున్న వీఆర్వో

నరసన్నపేట: జాతీయ రహదారికి ఆనుకుని నరసన్న చెరువు గర్భంలో రెడ్డికిపేట సమీపంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. చెరువుకు ఆనుకుని ఉన్న (గతంలో చెరువు గర్భం) స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేస్తుండగా స్థానికులు ద్వారా ఫిర్యాదు రావడంతో వెంటనే అప్రమత్తమైన తహసీల్దార్ ఎ.సింహాచలం వీఆర్వోకి పంపి తనిఖీ చేయించి, పనులు ఆపించారు. మేము కొన్నామని ఇది చెరువు స్థలం కాదని నిర్మాణదారుడు తెలపగా.. కొలతలు వేస్తామని అప్పటివరకు పనులు చేయవద్దని వీఆర్వో సూచించారు. అనుమతి లేకుండా పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘన జీవామృతంతో రైతుకు మేలు

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో ఘన జీవామృతం తయారీతో రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల రిసోర్స్ పర్సన్ ఎం పద్మావతి అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం, ఘన జీవామృతం తయారీ, వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పించారు. ఆవు పేడతో ఘన జీవామృతం తయారు చేసుకోవచ్చన్నారు. పెట్టుబడి తగ్గించుకుని ఎక్కువ దిగుబడులు సాధించేలా వ్యవసాయం చేయాలన్నారు.

ఆర్థికసాయం అందజేత



సరోజనికి ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: కొత్తూరుకు చెందిన కనపాకుల సరోజని భర్త ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. సరోజని తక్కువ వయస్సులోనే దృష్టిలోపంతోపాటు అనారోగ్య సమస్యలతో బాధ పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు (కొత్తూరు మండలం) సరోజనిని బుధవారం జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యం ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును అందజేశారు. ఎల్.ఎన్.పేట మండలం చిన్నకొల్లివలస గ్రామానికి చెందిన వట్టి సోమేశ్వరరావుకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. వైద్య ఖర్చుల నిమిత్తం ట్రస్టు సభ్యులు రూ.15 వేల నగదను అందజేశారు.

వాహనాల వేలం

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ ఆవరణలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలను వేలం వేశామని సీఐ వై.లక్ష్మనాయుడు తెలిపారు. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.22,184లకు వాహనాలను వేలంలో పాడుకున్నారని సీఐ తెలిపారు. ఎస్ఐ దస్తాగిరి, ఎస్ఈబీ పోలీసులు పాల్గొన్నారు.

‘ప్రజల భవిష్యత్తు జగనన్నతోనే’



ఆమదాలవలస: జగనన్నే మా భవిష్యత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



ఎల్.ఎన్.పేట: జగనన్నే మా భవిష్యత్తు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: హిరమండలంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



బూర్జ: పాలవలసలో అవగాహన కల్పిస్తున్న మండల నాయకులు

- 7 నుండి 20వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహణ
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆమదాలవలస: రాష్ట్ర భవిష్యత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏపీ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం జగనన్నే మా భవిష్యత్ పోస్టర్‌ను స్పీకర్ ఆవిష్కరించారు. ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 14 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ పండుగ వాతావరణంలో నిర్వహించాలని కోరారు. పార్టీ నియమించిన కన్వీనర్లు, గృహసారథులు ప్రతీరోజు 10 నుంచి 15 గృహాలను సందర్శించాలన్నారు. రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల కో కోఆర్డినేటర్లు అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, అత్తులూరి రవికాంత్, పార్టీ నాయకులు జె. కె.వెంకుబాబు, పొన్నాడ చిన్నారావు, కూన రామకృష్ణ, సంపతిరావు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

ఎల్.ఎన్.పేట: సంక్షేమ పథకాల కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని గొట్టిపల్లి, లక్ష్మీనర్సుపేట, కరకవలస, యంబరాం, రావిచెంద్రి గ్రామ సచివాలయాల్లో బుధవారం గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా ఇంటి గోడలపై స్టిక్కర్లు అతికించి వారికి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు కోసం అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ రెడ్డి రామారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గృహసారథులు, వలంటీర్లపై ఉందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమాన్ని వారికి వివరించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైస్ ఎంపీపీ వంగపల్లి సావిత్రి, ఎంపీటీసీ లుకలాపు సావిత్రి, సర్పంచ్‌లు డి.సుందరమ్మ, ఎం.చిన్నయ్య, విజయలక్ష్మి, పి.పల్లవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘మా నమ్మకం నువ్వే జగన్'పై అవగాహన

బూర్జ: మండలంలోని డొంకలపర్త, పాలవలస, బూర్జ, నీలాదేవిపురం, ఓ.వి.పేట, కాలపర్తి, గుత్తావల్లి, చీడివలస, సచివాలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పర్యటించి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామ వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం కల్పించిన లబ్ధి తెలియజేయాలని కోరారు. జెడ్పీటీసీ బెజ్జిపు రపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణమూర్తి, సచివాలయ మండల కన్వీనర్ గుమ్మడి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక ఆసరా



సారవకోట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూడో విడత ఆసరా పథకం చెక్కను మహిళా సంఘాలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల్లో ఇచ్చిన అన్ని ఆహామీలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు స్వయం శక్తి సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి తన పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాల రుణాలను మాఫీ చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నారన్నారు. సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతో అందజేసి, వారు సమాజంలో ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు మాట్లాడుతూ మండలంలోని 1027 మహిళా సంఘాలకు రూ.6.24 కోట్లు జమైందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పీటీసీ వరుదు నాగేశ్వరి, వైస్‌ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, పార్టీ మండల కమిటీ అధ్యక్షులు వరుదు వంశీకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ నక్క తులసీదాస్, సర్పంచ్‌లు శంకరబాబు, బాడాన కృష్ణారావు, ఇసై షణ్ముఖరావు, జన్ని అనిరుద్రుడు, మండల ప్రత్యేకాధికారి వి.జయరాజ్, తహశీల్దార్ ప్రవల్లికా ప్రియ, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఏపీఎం గోవిందరాజులు, ఏసీ శ్రీరాములు తదితరులున్నారు.



సరుబుజ్జిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, మహిళలు

మహిళా సాధికారితే లక్ష్యం

సరుబుజ్జిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే మహిళా సాధికారిత సాధ్యపడుతుందని దకరవలస సర్పంచ్ సురవరపు తిరుపతిరావు తెలిపారు. ఆసరా సంబరాలను దకరవలసలో బుధవారం నిర్వహించారు. మహిళలతో కలిసి సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.అనంతరం ర్యాలీ చేపట్టారు. వైకేపీ సీసీ రోజాలత పాల్గొన్నారు.

మానవతావాది సీఎం జగన్



చెక్కు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, పార్టీ నాయకులు

- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: మానవతావాది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2024లో మరళా గెలిపించుకుని చరిత్ర తిరగరాద్దామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మూడో విడత ఆసరా సంబరాల్లో పాల్గొలను బుధవారం నిర్వహించారు. మండలంలోని 1319 సంఘాల్లోని 15161 మంది మహిళలకు రూ.9.45 కోట్లు చెక్కును అందజేశారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా ఇళ్ల వద్దకే అందజేస్తున్నారన్నారు. మార్గదర్శి ద్వారా వచ్చిన డబ్బులతో, ప్రజల నుంచి వచ్చిన డిపాజిట్లతో, పేద ప్రజల సొమ్ములతో ఈనాడు పత్రికను స్థాపించారని అన్నారు. జెడ్పీ చైర్మన్ పిరియా విజయ మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు డ్వాక్రా సంఘాలు రోడ్డు మీద పడ్డాయన్నారు. జన్మభూమి కమిటీలను పెట్టి పనికి రేటు పెట్టిన ఘనత చంద్రబాబుదన్నారు. మహిళలకు చేయూత, చేదోడు, అమ్మఒడి వంటి పథకాలను సీఎం జగన్ అందించారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు తీసివేస్తామని చంద్రబాబు, లోకేష్ అంటున్నారని చెప్పారు. తమ పార్టీ గురించి మాట్లాడే అర్హత ఎంపీ రామ్మోహననాయుడుకు లేదన్నారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ సీఎం జగన్‌ను, ఎమ్మెల్యేగా తమ్మినేని సీతారాంను మరలా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మరన్నారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, నాయకులు రేగిడి లక్ష్మి, గాడు నాగరాజు, గుడ్ల మోహన్, అనకాపల్లి గోవింద, కిల్లాన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

సరుబుజ్జిలి: సైబర్ నేరాల పట్ల ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ మోటివేటర్ సి.హెచ్.వెంకటేష్ తెలిపారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టీ సంస్థ ఆధ్వర్యంలో వెన్నెలవలసలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సీఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా లక్ష్మీనారాయణ



సారవకోట: స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐగా బి.లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మెరైన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇక్కడకు బదిలీపై ఏఎస్ఐగా వచ్చారు. ఈయనకు స్టేషన్ సిబ్బంది అభినందించారు.

104 వాహనం కేటాయింపు

కొత్తూరు: మెట్టూరు పీహెచ్‌సీకి 104 వాహనం మంజూరైనట్లు కురిగాం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి శ్రీలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ వాహనంతో 13 గ్రామ సచివాయాల పరిధిలో సుమారు 30 వేల మందికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. కురిగాం పీహెచ్‌సీ పరిధిలోకి వచ్చిన 13 గ్రామ సచివాలయాల్లో 4 నాలుగు హిరమండలం పీహెచ్‌సీ పరిధిలోకి, తొమ్మిది గ్రామ సచివాలయాలు కురిగాం పీహెచ్‌సీలో వస్తాయన్నారు. ఇప్పటికే కురిగాం పీహెచ్‌సీకి వైద్యాధికారిని ప్రభుత్వం నియమించినట్లు వైద్యాధికారి శ్రీలక్ష్మి చెప్పారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి జన్మదినం



సరుబుజ్జిలి: అయ్యప్ప జన్మదిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు



సారవకోట: హోమం నిర్వహిస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: శబరిగిరి అయ్యప్పస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా పురుషోత్తపురం అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి భాస్కర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి కుంకుమ పూజలు, క్షీరాభిషేకాలు, సహస్ర నామార్చనలు చేపట్టారు. కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొనారు.

సారవకోట: మండలంలోని కోదడ్డపనస స్వయంభూ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప జన్మదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ బల్యపల్లి సుబ్బారావు ఆలయంలో స్వామి వారికి 108 కలశలతో అభిషేకం, హోమం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పౌష్టికాహారంతోనే క్షయ వ్యాధి నిర్మూలన



పౌష్టికాహార కిట్లును పంపిణీ చేస్తున్న జగన్మోహన్‌రావు, అనురాధ

కొత్తూరు: క్షయతో బాధపడుతున్నవారు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నయమవుతుందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ఎయిడ్స్, కుష్టి, క్షయవ్యాధుల నివారణ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు అధికారి ఎస్.అనురాధ అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కురిగాం పీహెచ్‌సీ, కొత్తూరు సీహెచ్‌సీలో క్షయ బాధితలకు జిల్లాలో పలు ట్రస్టులు, సేవా సంఘాల ద్వారా సమకూర్చిన సౌష్టికాహార కిట్లును బుధవారం పంపిణీ చేశారు. సబ్బులు, పలు రకాల లిక్విడ్‌లు అందజేశారు. క్షయ వ్యాధి నివారణ నిపుణులు సాయిగీత, కురిగాం పీహెచ్‌సీ వైద్యులు శ్రీలక్ష్మి, సందీప్, ఈఓ బుజ్జిబాబు, రెడ్‌క్రాస్ సొసైటి కొత్తూరు శాఖ చైర్మన్ పాగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

కూనపై కేసులు నమోదు చేయాలి


- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: పొందూరు మండలం కృష్ణాపురంలోని క్వారీ వద్ద విద్యార్థి బగాది మణికంఠ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపి.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్‌పై కేసులు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ డిమాండ్ చేశారు. ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం జి.ఎస్.పురం గ్రామానికి చెందిన మణికంఠ నిరుపేదని.. పగలు చదువుకుంటూ, రాత్రి వేళల్లో క్వారీలో పనిచేస్తుండేవాడన్నారు. అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని బయట పెడతానని మణికంఠ చెప్పడంతోనే హత్య చేశారని, మృతదేహాన్ని చిలకపాలెం-పొందూరు రహదారిపైకి తరలించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రవికుమార్ నిర్వహిస్తున్న అక్రమ క్వారీలో మణికంఠ పని చేస్తుండేవాడని వివరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూన గ్రానైట్ క్వారీలు అక్రమంగా నిర్వహిస్తున్నాడన్నారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాలకు అనర్హుడన్నారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని సీఎం జగన్మోహన్‌రెడ్డిని కోరతానని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముద్దాడ ఈశ్వరరావు, పార్టీ కార్యకర్తలు అన్నెపు కృష్ణ, రుప్ప దుర్గారావు, రామ్మోహన్, సంతోష్, గిరి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గడ్డెయ్య చెరువు అభివృద్ధి



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శంకర్, తదితరులు

నరసన్నపేట: నరసన్నపేట పరిధిలోని శివరాంపురం వద్ద గడ్డెయ్య చెరువును ఆహ్లాదంగా తీర్చిదిద్దనున్నట్లు సర్పంచ్ బూరల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు అన్నారు. ఇప్పటికే ఉపాధి నిధులతో చెరువును అభివృద్ధి చేయడం జరుగుతుందని, దీంట్లో నీరు పెట్టి చెరువును సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. స్థానికులు రావాడ మోహనరావు, ముద్దాడ గోవిందరావు, కర్రి సిమ్మయ్య, గొల్లంగి బాలరాజుతో చర్చించి చెరువుకు నీరు పెట్టేందుకు అవసరమైన పైప్‌లైన్ వేయడానికి బుధవారం నిర్ణయించారు. ఈ మేరకు వెంటనే పనులు చేపట్టారు. చెరువు గట్టును అభివృద్ధి చేశారు.

జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు

దేశంలో సామాజిక న్యాయం నెలకొల్పడంలో మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ పాత్ర కీలమని ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, పలువురు వక్తలు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవల నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయాన్ని ఆధునికీకరించడంలో జగ్జీవన్‌రామ్ కీలకపాత్ర పోషించారన్నారు. దేశంలో అనేక మంత్రిత్వ శాఖలు చేపట్టిన వ్యక్తి కూడా ఆయనేనన్నారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: కోర్టు కూడలి వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహాని నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవనరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



బూర్జ: ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



సరుబుజ్జిలి: ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



సారవకోట: ఎంపీడీఓ కార్యాలయంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు



కొత్తూరు: నివగాంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ కామక భాగ్యవతి



మెళియాపుట్టి: ఎంపీడీఓ కార్యాలయంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు



ఎల్.ఎన్.పేట: ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలను వేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: జీజే కాలేజీ ఆవరణలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు